క్లుప్తంగా

సమానత్వ సమాజ సాధనే కేవీపీఎస్ లక్ష్యం


కేవీపీఎస్ జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: ఆత్మగౌరవం, సమానత్వం, కుల నిర్మూలన కోసం కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం కేవీపీఎస్ పోరాడుతుందని జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ పేర్కొన్నారు. కేవీపీఎస్ 26వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ 1998 అక్టోబర్ 2న కేవీపీఎస్ ఆవిర్భవించిందన్నారు. 26 ఏళ్ల ప్రస్థానంలో అనేక ఉద్యమాలు, పోరాటాలు నడిపి రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ చట్టన్ని సాధించేందుకు ప్రధాన భూమిక పోషించిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్, కార్యదర్శి కార్తిక్, నాయకులు తిరుపతి, మనోహర్, నిఖిల్, శ్రావణి, శ్రీకాంత్, రాజు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

మినీ ఇండోర్ స్టేడియం మంజూరు చేయాలి


శివసేన రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దీపక్ ముండె

వాంకిడి: మండల కేంద్రంలో మినీ ఇండోర్ స్టేడియం మంజూరు చేయాలని మండల కాంగ్రెస్ పార్టీ నాయకుడు దీపక్ ముండే బుధవారం రాష్ట్ర యువజన, క్రీడల విభాగం చైర్మన్ శివసేన రెడ్డికి వినతిపత్రం అందజేశారు. మండల యువత ఆట స్థలం లేక క్రీడలకు దూరం అవ్వాల్సి వస్తుందని వినతిపత్రంలో తెలిపారు. ఇందుకు చైర్మన్ సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

మండపాలు ముస్తాబు


గాంధీ చౌక్ వద్ద ముస్తాబైన దుర్గామాత మండపం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని వివిధ ఆలయాలు, కూడళ్ల వద్ద గురువారం దుర్గా, శారదా మాతను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు ఏర్పాట్లు చేస్తున్నారు. శరన్నవరాత్రులు పురస్కరించుకొని తొమ్మిది రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. ఇప్పటికే మండపాలు ముస్తాబయ్యాయి.

రామాలయంలో ఇనుప సామగ్రి చోరీ

రెబ్బెన: మండల కేంద్రంలోని శ్రీసీతారామాంజనేయ స్వామి ఆలయానికి సంబంధించిన ఇనుప సామగ్రి గత నెల 30న గుర్తు తెలియని దొంగలు చోరీ చేసినట్లు రెబ్బెన ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. గతంలో అన్నదానం వంటషెడ్డు నిర్మాణం కోసం ఆలయ కమిటీ సభ్యులు ఇనుప సామగ్రిని ఆలయ ప్రాంగణంలో భద్రపరిచారు. ఈనెల 1న ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్‌రావు ఉదయం పూజలు చేసి వెళ్తున్న క్రమంలో సామగ్రి కనిపించలేదు. వెంటనే ఈ విషయాన్ని ఆలయ కమిటీ సభ్యులకు తెలిపాడు. వారు వచ్చి పరిశీలించగా ట్రాక్టర్, వ్యాన్ టైర్ల అచ్చులను గుర్తించారు. ఈనెల 30న అర్ధరాత్రి చోరీ జరిగినట్లు గుర్తించి, పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీకి గురైన సామగ్రి విలువ రూ. లక్ష వరకు ఉంటుందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

'జాలం సింగ్ ఆశయాలు కొనసాగిద్దాం'

నార్నూర్: బంజారా దిగ్గజం, సామాజికవేత్త, కీర్తిశేషులు బానోత్ జాలం సింగ్ ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు జాదవ్ రెడ్డినాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని బానోత్ జాలంసింగ్ జయంతి సందర్భంగా విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాల కోసం ఎంతో కృషి చేశారని కొనియాడారు. మాజీ సర్పంచ్ బానోతు గజానంద్ నాయక్, ప్యాక్స్ చైర్మన్ ఆడే సురేశ్, ఓబీసీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు పుష్కర్ జ్ఞానోబా, మాజీ జెడ్పీటీసీ బ్రిజులల్, మాజీ మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ షేక్ దాదాఅలీ, గ్రామ పెద్దలు యశ్వంత్ రావు చౌహాన్, శివాజీ పటేల్, ఉప సర్పంచ్ మహేందర్ తదితరులు ఉన్నారు.

ఘనంగా గాంధీ జయంతి

- నివాళులర్పించిన అధికారులు, నాయకులు


కాగజ్‌నగర్‌రూరల్: పరిసరాలను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు, కొత్తపల్లి శ్రీనివాస్


ఆసిఫాబాద్‌అర్బన్: పూలమాల వేస్తున్న రాజుర బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ యాదవ్

ఆసిఫాబాద్‌అర్బన్: మహాత్మా గాంధీ అనుసరించిన సత్యం, శాంతి, అహింస మార్గాల ద్వారానే విజయాలు సాధ్యమని, ఆయన సిద్ధాంతాలే నేటి యువతకు మార్గదర్శకాలని ఎస్పీ డీవీ శ్రీనివాసరావు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహాత్ముడి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గాంధీ చూపించిన అడుగు జాడల్లో నడవాలని సూచించారు. ఇన్‌స్పెక్టర్‌లు సతీశ్, పెద్దయ్య, అంజన్న, మార్కండేయ, హరినాథ్, జిల్లా పోలీసు సంఘం అధ్యక్షుడు విజయశంకర్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో..

గాంధీ జయంతి పురస్కరించుకొని బుధవారం జిల్లా కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకలకు మహారాష్ట్ర, రాజూర ఎమ్మెల్యే సంజయ్ యాదవ్ హాజరయ్యారు. గాంధీ విగ్రహానికి పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రె విశాల్‌తో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాగా జిల్లాకేంద్రంలో వాసవిక్లబ్ ఆధ్వర్యంలో సైతం మహాత్ముడికి ఘనంగా నివాళులర్పించారు. నాయకులు నీలేష్, తాజని, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్: మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాలతో పాటు గ్రామపంచాయితీ కార్యాలయాల్లో జాతిపిత మహాత్మా గాంధీ జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. దేశానికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

కౌటాల: జాతిపిత మహాత్మా గాంధీ అడుగు జాడల్లో ప్రతీ ఒక్కరు నడవాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు అయా గ్రామాల్లోని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రజలు గాంధీ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్, ఎంపీడీవో, ఎంఈవో కార్యాలయాల్లో జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి): మండలకేంద్రంతో పాటు మండలంలోని గ్రామాల్లో బుధవారం మహాత్మా గాంధీజీ జయంతి ఘనంగా నిర్వహించారు. మండలంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పేట్‌మహెలా కాలనీలోని హనుమాన్ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు జయంతి నిర్వహించారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో సత్యనారాయణల ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు.

రెబ్బెన: గోలేటి టౌన్‌షిప్‌లోని టీబీజీకేఎస్ కార్యాలయంలో బుధవారం జాతిపిత మహాత్మగాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. టీబీజీకేఎస్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు, ఏరియా కార్యదర్శి మారిన వెంకటేశ్వర్లు, కమిటీ నాయకులు ఓరం కిరణ్, మంతు సమ్మయ్య, ఆఫీస్ ఇన్‌చార్జి మహేందర్, నాయకులు స్వామి, దుంపల బాపు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలో బుధవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీజీ, లాల్‌బహదూర్ శాస్త్రీల జయంతి ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు రమేశ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దుర్గం దేవాజీ, పట్టణ అధ్యక్షుడు మురళీ, నాయకులు చిరంజీవిగౌడ్, సోమశేఖర్, గంటు మేర, మదునయ్య, రాజాగౌడ్, వెంకటేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్‌రూరల్: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడమే గాంధీజీకి మనమిచ్చే నివాళి అని ఎమ్మెల్యే డాక్టర్ హరీశ్‌బాబు అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా పట్టణంలోని గాంధీపార్కులో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీ జయంతి నిర్వహించారు. సేవా మహాయజ్ఞంలో భాగంగా స్వచ్ఛతా అభియాన్ కింద గాంధీ విగ్రహం చుట్టూ పరిసరాలను శుభ్రం చేశారు. మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ రాచకొండ గిరీశ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు సిందం శ్రీనివాస్, మహిళా మోర్చా అధ్యక్షులు శ్రీదేవి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో...

గాంధీ జయంతి సందర్భంగా సిర్పూర్ నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి రావి శ్రీనివాస్ ఆధ్వర్యంలో గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిద్దాల దేవయ్య, నాయకులు ప్రసాద్, ఎమ్మాజీ సంతోశ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు. మాజీ జెడ్పీ చైర్మన్ సిడాం గణపతి, మాజీ కౌన్సిలర్ షబ్బీర్ హుస్సేన్, మహేశ్‌గౌడ్, దేవాజీ, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.


కౌటాల జీపీలో వేడుకలు


సిర్పూర్(టి): తహసీల్దార్ కార్యాలయంలో..


పెంచికల్‌పేట్: తహసీల్దార్ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు


ఆసిఫాబాద్‌అర్బన్: గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఎస్పీ


కాగజ్‌నగర్‌రూరల్: గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న రావి శ్రీనివాస్


రెబ్బెన: గోలేటిలో గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

108లో ప్రసవం


శిశువును అప్పగిస్తున్న 108 సిబ్బంది

పెంచికల్‌పేట్: మండలంలోని చేడ్వాయి గ్రామానికి చెందిన మహిళకు 108 వాహనంలో సిబ్బంది కాన్పు చేశారు. గ్రామానికి చెందిన గర్భిణీ నిమిడె రజితకు బుధవారం పురిటి నొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కు సమాచారం అందించారు. చేడ్వాయి నుంచి గర్భిణీని కాగజ్‌నగర్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలిస్తున్న క్రమంలో ఈస్‌గాం వద్ద పురిటి నొప్పులు అధికం కావడంతో సిబ్బంది డెలివరీ చేయగా ఆడబిడ్డకు జన్మనిచ్చింది. తల్లి, బిడ్డలు క్షేమంగా ఉన్నట్లు ఈఎంటీ నేరెళ్ల శంకర్, పైలెట్ ఎం. కిశోర్ తెలిపారు.

మన్నెవార్ మండల కార్యవర్గం ఎన్నిక


నూతన కార్యవర్గం

కౌటాల: మండల కేంద్రంలోని మన్నెవార్ సేవా సంఘం భవనంలో బుధవారం మన్నెవార్ సేవా సంఘం మండల కమిటీని ఎన్నుకున్నారు. కమిటీ మండలాధ్యక్షుడిగా ఆత్రం సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా బుర్స హన్మంతు, ఉపాధ్యక్షులుగా సిద్దయ్య, అశోక్‌లను ఎన్నుకున్నారు. మండల యువజన సంఘం మండలాధ్యక్షుడిగా సుగుణాకర్, ప్రధాన కార్యదర్శిగా హన్మంతు, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌ను ఎన్నుకున్నారు. మన్నెవార్‌సేవా సంఘం అభివృద్ధికి, ఆదివాసీల హక్కుల పోరాటానికి కృషి చేస్తామని తెలిపారు. సంఘం జాతీయ అధ్యక్షుడు సుంకె కిష్టయ్య, రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచయ్య, జిల్లా అధ్యక్షుడు డబ్బా బాపు, తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి

కౌటాల: ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలని సీఐ ముత్యం రమేశ్ అన్నారు. బుధవారం కౌటాల పోలీస్‌స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌటాల సర్కిల్ పరిధిలోని ఆటోలకు ప్రత్యేక గుర్తింపు నంబర్ ఏర్పాటు చేయాలన్నారు. అతివేగంగా వాహనాలు నడిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతీ డ్రైవర్ లైసెన్స్ కలిగి ఉండాలని, మోటర్ వాహన చట్టం నిబంధనలు పాటించాలన్నారు. వాహనాల ధ్రువీకరణ పత్రాలు ఉండాలని సూచించారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఎస్సై మధుకర్, తదితరులు ఉన్నారు.


కౌటాల: మాట్లాడుతున్న సీఐ రమేశ్

వాంకిడిలో..

వాంకిడి: ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని ఎస్సై ప్రశాంత్ సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద డ్రైవర్లకు అవగాహన కల్పించారు. మండలంలో తిరిగే ఆటోలకు తప్పనిసరిగా టాప్ నంబర్లు ఏర్పాటు చేయాలని, రిజిస్ట్రేషన్, ఆటోకు సంబంధించిన పత్రాలన్నింటిని కలిగి ఉండాలని సూచించారు. టాప్ నంబర్లు లేని ఆటోలను సీజ్ చేసి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా ఎంగిలిపూల బతుకమ్మ


గోలేటిలో బతుకమ్మ ఆడుతున్న మహిళలు

రెబ్బెన: మండలంలోని అన్ని గ్రామాల్లో బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ ఘనంగా జరుపుకున్నారు. మొదటి రోజు తంగేడు, గుమ్మడితో పాటు రంగురంగుల తీరొక్క పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను కూడళ్ల వద్ద నిలిపి బతుకమ్మ పాటలు పాడారు. బుధవారం నుంచి తొమ్మిది రోజుల పాటు కొనసాగే బతుకమ్మ వేడుకలతో గ్రామాల్లో సందడి నెలకొంది.

దహెగాం: ఆడపడుచులకు అత్యంత ఇష్టమైన పండుగ బతుకమ్మ రానే వచ్చింది. బుధవారం ఎంగిలిపూల బతుకమ్మ ప్రారంభమైంది. తీరొక్క పూలతో బతుకమ్మ పేర్చి గౌరమ్మను పూజించి బతుకమ్మ పండుగ ప్రారంభించారు. మహిళలు బతుకమ్మ ఆడారు. కార్యక్రమంలో మహిళలు పాల్గొన్నారు.


రెబ్బెన: బతుకమ్మల వద్ద మహిళలు

మెడికల్ అన్‌ఫిట్ కార్మికులకు సన్మానం

రెబ్బెన: సింగరేణి కారుణ్య నియామకాల ప్రక్రియలో భాగంగా మెడికల్ అన్‌ఫిట్ అయిన టీబీజీకేఎస్ ఖైరిగూడ ఫిట్ కార్యదర్శి మారిన వెంకటేశం, మైన్స్ కమిటీ సభ్యుడు దాసరి బాబురావులను బుధవారం గోలేటిలోని యూనియన్ కార్యాలయంలో టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో యూనియన్ బెల్లంపల్లి ఏరియా ఉపాధ్యక్షుడు మల్రాజు శ్రీనివాస్‌రావు శాలువాలతో సన్మానించారు. సెంట్రల్ కమిటీ నాయకులు దారావత్ మంగీలాల్, చంద్రశేఖర్, ఓరం కిరణ్, ఏరియా నాయకులు వెంకటేశ్వర్లు, అలివేణి సంపత్, శ్రీనివాస్, గణపతి, రమేశ్, కైతస్వామి తదితరులు పాల్గొన్నారు.


సన్మానిస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

భక్తుల కొంగు బంగారం..
ఇద్దరమ్మల పుణ్యక్షేత్రం


ఆలయంలో కొలువైన కనకదుర్గాదేవి, మహంకాళి అమ్మవారు

- శరన్నవరాత్రి ఉత్సవాలకు ఇందిరానగర్ ఆలయం ముస్తాబు
- కొలువుదీరిన కనకదుర్గాదేవి, మహంకాళి అమ్మవార్లు
- నేటి నుంచి వైభవంగా ఉత్సవాలు


విద్యుత్ వెలుగులతో అందంగా ముస్తాబైన ఆలయం

రెబ్బెన: ఇద్దరమ్మలు కొలువైన పుణ్యక్షేత్రం.. ఇందిరానగర్‌లోని కనకదుర్గాదేవి, స్వయంభూగా వెలిసిన మహంకాళి అమ్మవార్ల ఆలయం భక్తుల కొంగుబంగారంగా విరాజిల్లుతోంది. రెండో చంద్రపూర్‌గా పేరుగాంచిన ఆలయంలో నేటి నుంచి తొమ్మిది రోజుల పాటు అంగరంగ వైభవంగా శరన్నవ రాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల నిర్వహణకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఉత్సవాలకు జిల్లాలోని భక్తులతో పాటు పక్క జిల్లాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి అమ్మవార్లను దర్శించుకోనున్నారు.

అందంగా ముస్తాబైన ఆలయం..

నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాన్ని అందంగా ముస్తాబు చేశారు. రంగు రంగుల విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆలయం శోభాయమానంగా దర్శనమిస్తోంది. చంద్రపూర్‌లోని మహంకాళి ఆలయంలో ఉన్న తరహాలోనే ఇందిరానగర్‌లోని ఆలయంలో సైతం గుహలో 10 అడుగుల అమ్మవారి విగ్రహం కొలువుదీరి ఉంది.

భారీగా తరలిరానున్న భక్తులు

ఇందిరానగర్‌లోని ఆలయంలో నిర్వహించే శరన్నవరాత్రి ఉత్సవాలకు భారీగా భక్తులు తరలిరానున్నారు. జిల్లాలోని భక్తులతో పాటు ఆదిలాబాద్, నిర్మల్, ఖమ్మం, హైదరాబాద్, కరీంనగర్, మంచిర్యాల, పెద్దపెల్లి, వరంగల్ జిల్లాలకు చెందిన భక్తులు భారీగా తరలిరానున్నారు. ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునే భక్తులు పట్టువస్త్రాలు, ఒడిబియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు చేస్తారు. కోరిన కోర్కెలు తీర్చమని అమ్మవారిని మొక్కుని ముడుపులు కడతారు. కోరుకున్న కోరికలు తీరిన భక్తులు అమ్మవారికి తలనీలాలు, పట్టువస్త్రాలు, నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకుంటారు.

రోజుకో అవతారంలో దర్శనం..

ఇందిరానగర్‌లోని స్వయంభూ మహంకాళి, కనకదుర్గాదేవి ఆలయంలో తొమ్మిది రోజుల పాటు నిర్వహించనున్న ఉత్సవాలకు భారీగా భక్తులు తరలివస్తారు. తొమ్మిది రోజుల పాటు అమ్మవారు రోజుకో అవతారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. మొదటి రోజు బాలత్రిపుర సుం దరి, రెండోరోజు గాయత్రిదేవి, మూడోరోజు అన్నపూర్ణదేవి, నాలుగోరోజు మహాలక్ష్మి, ఐదవ రోజు లలిత త్రిపుర సుందరీదేవి, ఆరవ రోజు సరస్వతి దేవి, ఏడో రోజు దుర్గాదేవి, ఎనిమిదో రోజు మహిషాసుర మర్ధిని, తొమ్మిదో రోజు రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు దర్శనమిస్తారు. రోజుకో అవతారంలో దర్శనమిచ్చే అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరిస్తారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రతీరోజు ప్రత్యేక పూజలు, హోమాలు, భజన సంకీర్తన, రాత్రి పూట అమ్మవారి పల్లకీ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తారు.

వైభవంగా ఉత్సవాలు

ఇందిరానగర్‌లో స్వయంభూగా వెలసిన మహంకాళి అమ్మవారు, కనకదుర్గాదేవి ఆలయంలో ప్రతీ ఏడాది దేవీ నవరాత్రి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నాం. ఈసారి కూడా వేడుకలను కనుల పండువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేశాం. తొమ్మిది రోజుల పాటు రోజుకో అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారు.

– దేవార వినోద్, ఆలయ ప్రధాన అర్చకుడు

నేటి నుంచి శరన్నవరాత్రులు

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని కేశవనాథ ఆలయంలో శరన్నవ రాత్రి ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభం కానున్నాయి. నవరాత్రులు పురస్కరించుకొని ఆలయాన్ని విద్యుద్దీపాలతో శోభాయమానంగా అలంకరించారు. ఆలయంలో ప్రతిరోజు ఉదయం స్వామి వారికి అభిషేకంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఐదు రోజుల పాటు రోజూ రాత్రి స్వామి వారిని వివిధ వాహనాల్లో ఊరేగింపు నిర్వహించనున్నారు. ఆయా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.


విద్యుద్దీపాల వెలుగుల్లో కేశవనాథ ఆలయం